క్లుప్తంగా

ఖైదీల భద్రత, పరివర్తనకు ప్రాధాన్యం



ఖైదీలకు కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

కంబాలచెరువు: ఖైదీల భద్రత, వారిలో పరివర్తనకే జైళ్లు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాయని కేంద్ర కారాగార సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ అన్నారు. జైల్లో ఖైదీలందరికీ నేత్ర పరీక్షలు నిర్వహించి, అవసరమైతే శస్త్ర చికిత్సలు చేసే వైద్య శిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. పలువురు వృద్ధ ఖైదీలకు పరీక్షల అనంతరం స్వయంగా కళ్లజోళ్లు తొడిగారు. రాహుల్ మాట్లాడుతూ జైలులో అందిస్తున్న పలు రకాల సేవలను ఖైదీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జైళ్ల శాఖ అందిస్తున్న శిక్షణను ఉపయోగించుకుంటూ మానసిక పరివర్తన చెందాలన్నారు. విడుదలైన తర్వాత కుటుంబానికి, సమాజానికి ఉపయోగపడాలని కోరారు. డిప్యూటీ సూపరింటెండెంట్లు ఎం.రాజకుమార్, బి.రత్నరాజు మాట్లాడుతూ ఐదు వారాల పాటు ప్రతి శనివారం ఈ నేత్ర శిబిరాన్ని నిర్వహించి, పరీక్షలు చేసి అవసరం మేర మందులు ఇవ్వడం, శస్త్ర చికిత్సలు చేయించడం, కళ్లజోళ్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయం ఆధ్వర్యంలో నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ ప్రణీత్, కో ఆర్డినేటర్ ఎన్.చంటిబాబు ఆధ్వర్యంలో సిబ్బంది వైద్య పరీక్షలు చేశారు. ఆమెన్ ట్రస్ట్ చైర్మన్ ఇవాంజిలిన్, అశోక్ తదితరులు ఖైదీలకు కళ్లజోళ్లు బహూకరించారు. కార్యక్రమంలో జైలర్లు ఆర్.శ్రీనివాసరావు, కేవీ రామారావు, డాక్టర్ కోమల, సోషల్ ఇంక్యుబేషన్ సభ్యులు చిలుకూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గాలమ్మ జాతర



జాతరలో పాల్గొన్న సోము వీర్రాజు, హాస్యనటుడు భద్రం

రాజమహేంద్రవరం రూరల్: కాతేరు గ్రామ దేవత దుర్గాలమ్మ జాతరను గ్రామపెద్దల ఆధ్వర్యంలో శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సుమారు పుష్కర కాలానికి ఒకసారి జరిగే ఈ మహోత్సవంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు, ఆయన అల్లుడు, హాస్య నటుడు భద్రం, కుటుంబ సభ్యులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సోము వీర్రాజు మాట్లాడుతూ అమ్మవార్ల జాతరలు కుటుంబ ఐక్యమత్యానికి, గ్రామాభివృద్ధికి నిదర్శమన్నారు. కార్యక్రమంలో గంగిన పెద్దబ్బులు, గంగిన నాగేశ్వరరావు, కొల్లి వెంకట్రావు, యానాపు ఏసు, బీవీ రామారావు, సోము కృష్ణ, సోము గాంధీ పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీపై సమీక్ష

కడియం: మండలంలో సోమవారం నుంచి పంపిణీ చేయనున్న పెన్షన్ల పంపిణీపై ఎంపీడీవో జి.రాజ్ మనోజ్ ఆధ్వర్యంలో ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ శనివారం సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పేరిట మండలంలోని 12,144 మందికి రూ.8.20 కోట్లు మంజూరయ్యాయన్నారు. వృద్ధులకు రూ.7 వేలు పెన్షన్‌గా అందిస్తారన్నారని, ఇందులో పెంచిన పెన్షన్ 4 వేలు, మూడు నెలలకు గాను మూడు వేలు ఉన్నాయని వివరించారు. అలాగే వికలాంగులకు కూడా రెట్టింపు చేసిన పెన్షన్ అందిస్తారన్నారు. సోమవారం ఉదయాన్నే పెన్షన్ల పంపిణీ ప్రారంభించి అదే రోజు పూర్తి చేసేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని ఎంపీడీవో ఆదేశించారు. ఈ మేరకు 27 సచివాలయాల పరిధిలో 14 మంది మండల స్థాయి అధికారులను నోడల్ ఆఫీసర్లుగా నియమించామన్నారు. సమావేశంలో సచివాలయాల సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌కేఆర్ విద్యార్థినుల ప్రతిభ

కంబాలచెరువు: కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాల విద్యార్థినులు ఏపీ సెట్‌లో ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవ కుమారి శనివారం తెలిపారు. ఎస్.సాత్విక, కె.శిరీష, పి.రూపశ్రీ, కె.జ్యోతిశ్రీ, టి.హర్షిత, స్రవంతి, రామకృష్ణ, మెర్సీగోల్డ్, ప్రసన్న, రమ్యశ్రీ, మనీషా, అనూష అంజలి, దీపిక, స్రవంతి, నాగజ్యోతి, ఆర్ఎస్.శ్రీనివాసరావు, రూపశ్రీ, మమత, మౌనిక సాహో ఆలియా ర్యాంకులు సాధించారన్నారు. వారిని కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

గణాంక దినోత్సవం

సీటీఆర్ఐ: భారతీయ శాస్త్రవేత్త, గణాంకవేత్త మహలనోబిస్ జయంతిని గణాంక దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు జాయింట్ డైరెక్టర్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ఎల్.అప్పలకొండ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం 18వ గణాంక దినోత్సవం నిర్వహించారు. అప్పలకొండ మాట్లాడుతూ దేశంలోని మొదటి ప్రణాళికా సంఘం సభ్యులలో ఒకరైన మహలనోబిస్ చేసిన కృషికి గుర్తింపుగా ఆయన జయంతిని గణాంక దినోత్సవంగా జరుపుకొంటున్నామన్నారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు ఏ.ముఖలింగం పాల్గొన్నారు.

సికిల్ సెల్ అంటువ్యాధి కాదు

- జిల్లా గిరిజన సంక్షేమ సాధికారిత అధికారి జ్యోతి
- పోస్టర్ల ఆవిష్కరణ



వ్యాధి నిర్మూలనపై పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా గిరిజన సంక్షేమ సాధికారిత అధికారి జ్యోతి, ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజమహేంద్రవరం రూరల్: సికిల్ సెల్ ఎనీమియా అంటువ్యాధి కాదని, జన్యుపరంగా తల్లిదండ్రుల నుంచి మాత్రమే సంక్రమిస్తుందని జిల్లా గిరిజన సంక్షేమ సాధికారిత అధికారి కేఎస్ జ్యోతి అన్నారు హుకుంపేట మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆ వ్యాధి నిర్మూలనపై ఆమె అధ్యక్షతన అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి ఒకరి నుంచి మరొకరికి గాలి, నీరు, చర్మం, ఆహార అలవాట్లు వల్ల సంభవించదన్నారు. కేవలం జన్యుపరంగా తల్లిదండ్రుల నుంచి మాత్రమే సంక్రమిస్తుందన్నారు. శరీరం తెల్లగా పాలిపోవడం, కళ్లు, నాలుక పచ్చగా ఉండడం, వయసుకు తగిన బరువు లేకపోవడం, కాళ్ల జాయింట్ల వద్ద వాపు దీని లక్షణాలన్నారు. ఈ వ్యాధి బాధితులు తమ దగ్గరకు వచ్చే ఏఎన్ఎంలు అందజేసే మందులను కచ్చితంగా వాడాలన్నారు. ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, పరిపాలనాధికారి బీవీజీఎస్ఆర్ ఆచారి, ఈవోపీఆర్అండ్ఆర్డీ డి.బాబూరావు, పంచాయతీరాజ్ ఏఈ సంపత్ కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీనివాస్, వ్యవసాయాధికారి ఏ.భీమరాజు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ విజయవంతం చేయాలి

మండలంలో సోమవారం జరిగే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా గిరిజన సంక్షేమ సాధికారిత అధికారి కేఎస్ జ్యోతి తెలిపారు. ఈ మేరకు శనివారం హుకుంపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో డి.శ్రీనివాసరావు అధ్యక్షతన గ్రామాల నోడల్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. జ్యోతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి, తమకు కేటాయించిన పింఛన్లను లబ్ధిదారులకు తొలిరోజే అందజేయాలన్నారు. మండల స్థాయి అధికారులను గ్రామాలలో పింఛన్ల పంపిణీకి నోడల్ ఆఫీసర్లుగా నియమించామన్నారు. వారు పింఛన్ల పంపిణీ విజయవంతంగా నిర్వహించేలా పర్యవేక్షించాలన్నారు. అలాగే గ్రామాలలో డయేరియా వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మంచి నీటి పైపులైను లీకేజీలు లేకుండా చూడాలన్నారు. ఎంపీడీవో డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి సచివాలయ ఉద్యోగి తనకు అప్పగించిన క్లస్టర్ పరిధిలో పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేసేలా సన్నద్ధం కావాలన్నారు.

జీఎస్ఎల్‌లో మరో నెల పాటు ఉచిత వైద్యం

రాజానగరం: జీఎస్ఎల్ వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న జనరల్ ఆస్పత్రిలో నెల రోజులుగా అందిస్తున్న ఉచిత వైద్య సేవలను మరో నెల పాటు కొనసాగించాలని నిర్ణయించామని ఆస్పత్రి చీఫ్ మెంటర్ డాక్టర్ గన్ని భాస్కరరావు తెలిపారు. డాక్టర్ డే అయిన జూలై ఒకటిన వైద్య కళాశాలను ప్రారంభించి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రోగులకు ఈ సదుపాయాన్ని కల్పిస్తున్నామన్నారు. ఈ నెల రోజులు అందించిన విధంగానే అన్ని రకాల చికిత్సలు, మెడికల్ ప్రొసీజర్లు, సర్జరీలు మరో నెల రోజులు ఉచితంగా చేస్తామన్నారు. అయితే వైద్య పరీక్షలు, ఇన్వెస్టిగేషన్లకు సంబంధించిన ఫీజులలో మాత్రం 50 శాతం రాయితీ ఉంటుందన్నారు. ఆరోగ్యశ్రీ పథకంలో చేసే వైద్య సేవలు యథావిధిగా కొనసాగుతాయన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి సహాయకుల జీఎస్ఎల్ అమ్మ భోజనం పథకంలో రూ.10 కే భోజనాన్ని అందిస్తామన్నారు. 20వ వార్షికోత్సవంలో పాల్గొనేందుకు సోమవారం రానున్న ముఖ్యఅతిథి, ప్రముఖ రేడియోషన్ ఆంకాలజిస్టు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. అదే రోజు రాజమహేంద్రవరంలోని కేన్సర్ ఆస్పత్రిలో హార్మోని యూనిట్‌ని కూడా ఆయన ప్రారంభిస్తారని డాక్టర్ భాస్కరరావు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం



అవగాహనపై ర్యాలీలో పాల్గొన్న దిలీప్‌కుమార్ తదితరులు

కంబాలచెరువు: సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగి ఉంటే, వాటి బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చని అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ అన్నారు. స్థానిక మునిసిపల్ కాలనీలోని బీఈఎం ఎయిడెడ్ ఉన్నత పాఠశాల, నాగరాజా ఉన్నత పాఠశాల, కాశీ స్పెషల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి శనివారం ఆయా ప్రాంతాలలో ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా ఇంటి పరిసరాలు శుభ్రంగా చూసుకోవాలన్నారు. మురుగునీరు నిల్వ ఉంటే దోమలు పెరిగి, మలేరియా ప్రబలే ప్రమాదం ఉందన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. కార్యక్రమంలో నాగరాజా మునిసిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చక్రధర్, బీఈఎమ్ ఎయిడెడ్ పాఠశాల ఉపాధ్యాయులు బి.చిట్టిబాబు, సీఆర్పీలు జయంతి శాస్త్రి, జె.శ్రీనివాసరావు, కుమారి, ఇందిర, కోటేశ్వరి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు మెషీన్ల పంపిణీ

రాజమహేంద్రవరం సిటీ: సమాజంలో అవసరార్థులను గుర్తించి, వారికి సేవలందించడంలో స్వర్ణాంధ్ర సంస్థ అగ్రగామిగా నిలుస్తోందని స్వర్ణాంధ్ర ఉపాధ్యక్షులు బొప్పన వంశీకృష్ణ (హైదరాబాద్) అన్నారు. లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమ ప్రాంగణంలో శనివారం మహిళలకు కుట్టు మెషీన్లను పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వంశీకృష్ణ చేతుల మీదుగా ఇద్దరు మహిళలకు జీవనోపాధి కోసం రెండు కుట్టు మెషీన్లు అందించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు మాట్లాడుతూ అవసరమని తమ సంస్థ గడప తొక్కిన ప్రతి ఒక్కరికి తగు రీతిలో సహాయం అందించడానికి కృషి చేస్తున్నామన్నారు. మహిళల స్వయం ఉపాధి కోసం కుట్టు, మగ్గం వర్కులలో



మహిళలకు కుట్టు మెషీన్లు అందజేస్తున్న వంశీకృష్ణ

శిక్షణ అందించడంతో పాటు మెటీరియల్ కూడా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బొప్పన నాగేశ్వరరావు, బద్రి జగదీష్, ధనలక్ష్మి, శకుంతల, విరజ పాల్గొన్నారు.

కారు షెడ్డు దగ్ధం : రూ.4 లక్షల ఆస్తినష్టం

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం ఆవ రోడ్డులోని ఏలూరి వెంకట మాణిక్యాలరావుకు చెందిన కారుషెడ్డులో శుక్రవారం రాత్రి 10.40 గంటల సమయంలో మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి మంటలను అదుపు చేశారు. అప్పటికే ఒక ఇన్నోవా కారు పూర్తిగా కాలిపోగా, షెడ్డులోని గది, రెండు కార్లు స్వల్పంగా దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.4 లక్షల వరకూ ఆస్తినష్టం సంభవించిందని జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి పి.శ్రీనివాసరావు తెలిపారు. ఘటనా స్థలాన్ని సౌత్ జోన్ డీఎస్పీ అంబికా ప్రసాద్, టూటౌన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఎస్సై పీవీ రత్తయ్య పరిశీలించారు.



షెడ్డు యజమానిని వివరాలు అడుగుతున్న డీఎస్పీ అంబికా ప్రసాద్

యజమాని మాణిక్యాలరావును అడిగి తెలుసుకున్నారు. అయితే షెడ్డులోని సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించగా, గదిలోని దేవుడి ముందు పెట్టిన దీపం నుంచి మంటలు వ్యాపించినట్లు డీఎస్పీ అంబికా ప్రసాద్ తెలిపారు.

ఉత్సాహంగా మిస్ రాజమహేంద్రవరం ఆడిషన్లు



మిస్ రాజమహేంద్రవరం ఆడిషన్లకు హాజరైన యువతులు, నిర్వాహకులు

రాజమహేంద్రవరం సిటీ: రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ ఆధ్వర్యంలో శనివారం మిస్ రాజమహేంద్రవరం ఆడిషన్లు నిర్వహించారు. జేఎన్ రోడ్డులోని డీ వన్ కన్వెన్షన్ హాల్లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఐకాన్స్ అధ్యక్షుడు తీగల రాజా మాట్లాడుతూ నగరంలో మొదటిసారిగా మిస్ రాజమహేంద్రవరం కార్యక్రమం చేపట్టి, యువతలో ప్రతిభను ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమ ఫైనల్స్‌ను జూలై 20వ తేదీన శ్రీ వెంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో నిర్వహిస్తామన్నారు. ఆ కార్యక్రమానికి 2023 మిస్ ఇండియా నందినీ గుప్తా ముఖ్యఅతిథిగా హాజరై.. మిస్ రాజమహేంద్రవరాన్ని ఎంపిక చేస్తారన్నారు. ప్రోగ్రాం చైర్మన్ రఘునందరాజు మాట్లాడుతూ ఆడిషన్లకు 90 మంది యువతులు హాజరయ్యారన్నారు. న్యాయ నిర్ణేతలుగా భిన్న రంగాలకు చెందిన నలుగురు ప్రముఖులు వ్యవహరించారని తెలిపారు.

పోలీసుల సేవలు ప్రశంసనీయం



ఉద్యోగ విరమణ చేసిన పోలీసులను సన్మానిస్తున్న ఎస్పీ జగదీష్

- కొనియాడిన ఎస్పీ జగదీష్
- ఉద్యోగ విరమణ చేసిన వారికి ఘనంగా సన్మానం

కంబాలచెరువు: పోలీసు అధికారుల సేవలు ప్రశంసనీయమని ఎస్పీ పి.జగదీష్ కొనియాడారు. జిల్లా పోలీసు విభాగంలో పనిచేసిన అడిషనల్ ఎస్పీ టి.సర్కార్, ఇన్‌స్పెక్టర్ సీహెచ్.సూర్య భాస్కరరావు, ఎస్సై ఎస్.వెంకటేశ్వరరావు, ట్రాఫిక్ ఎస్సై కె.జయప్రసాద్, ఏఆర్ ఎస్సై ఎస్.వెంకటేశ్వరరావు, కానిస్టేబుల్ వి.కృష్ణ శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా వారిని ఎస్పీ జగదీష్ ఘనంగా సన్మానించి, ఆత్మీయ వీడ్కోలు పలికారు. వారికి శాలువాలు కప్పి, పూలమాలలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి.అనిల్ కుమార్, డీఎస్పీలు డి.ప్రభాకర్, ఎం.అంబికా ప్రసాద్, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, జిల్లా పోలీసు అధికారులు పాల్గొన్నారు.



మహిళలను రక్షించిన పోలీసులను సత్కరిస్తున్న ఎస్పీ జగదీష్

మహిళను రక్షించిన పోలీసులకు సత్కారం

గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకోబోయిన మహిళను కాపాడిన టూ టౌన్ ఎస్సై పీవీ రత్తయ్య, కానిస్టేబుళ్లు వై.లీలాకుమార్, బీవీ రమణ, పడవ నడిపిన ముగ్గురు జాలర్లను ఎస్పీ పి.జగదీష్ సన్మానించారు. స్థానిక పోలీసు కార్యాలయంలో శనివారం వారిని శాలువాతో కప్పి ప్రత్యేకంగా అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఒక వివాహిత శుక్రవారం సాయంత్రం రోడ్ కమ్ రైల్ బ్రిడ్జి నుంచి గోదావరిలో దూకిన విషయం విదితమే.

మర్యాదపూర్వకంగా..



కలెక్టర్ ప్రశాంతికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

సీటీఆర్ఐ: కలెక్టర్ పి.ప్రశాంతిని శనివారం జిల్లా రెవెన్యూ ఉద్యోగులు కలిసి, శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలులో చిత్తశుద్ధితో పనిచేసి, రాష్ట్రంలో జిల్లాను అగ్రగామిగా నిలవడానికి కృషి చేస్తామన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఏపీఆర్ఎస్ఏ అధ్యక్షుడు గొలుగూరి బాపిరాజు, కార్యదర్శి ఎంకే ప్రసాద్, రాజమహేంద్రవరం డివిజన్ యూనిట్ అధ్యక్షులు సురేష్ బాబు, పరిమళ తదితరులు పాల్గొన్నారు.

పంపింగ్ స్కీమ్ నీరు విడుదల



పాత వెంకటనగరం పంపింగ్ స్కీమ్ స్విచ్ ఆన్ చేసి నీరు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి

రాజమహేంద్రవరం రూరల్: పాత వెంకటనగరం పంపింగ్ స్కీమ్ ద్వారా వెంకట నగరం, తొర్రేడు, కాతేరు, కొంతమూరు గ్రామాల్లోని రెండు వేల ఎకరాల సాగుకు లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. ఆయన శనివారం పంపింగ్ స్కీమ్ స్విచ్ ఆన్ చేసి, పూజలు నిర్వహించి ఖరీఫ్ పంటకు నీరు విడుదల చేశారు. అనంతరం ఇరిగేషన్ డీఈ కె.ఆనందబాబు, ఏఈ వి.ప్రసన్నకుమార్‌లతో సమీక్ష నిర్వహించారు. పంపింగ్ స్కీమ్‌కు సంబంధిత పంపు హౌస్ సబ్‌స్టేషన్, కాలువల పునరుద్ధరణకు అంచనా వేయాలని అధికారులను ఆదేశించారు. మండల టీడీపీ అధ్యక్షుడు మత్స్యేటి ప్రసాద్, నున్న కృష్ణ, కురుకూరి కిషోర్, మన్యం పెద్దబాబు పాల్గొన్నారు. అలాగే తొర్రేడులోని టిడ్కో ఇళ్లను ఎమ్మెల్యే గోరంట్ల సందర్శించారు.

ఎన్‌సీసీ క్యాంప్‌లో అఖిల్ ప్రతిభ



అఖిల్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్రరావు

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ అటానమస్ కళాశాలలో చదువుతున్న రాజమహేంద్రవరానికి చెందిన ఎన్‌సీసీ విద్యార్థి అఖిల్ గుంటూరులో ఇటీవల జరిగిన ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ క్యాంప్‌లో ఉత్తమ ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం అఖిల్‌ను అభినందించారు. ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ క్యాంప్‌లో ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్‌కు చెందిన ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్నారు. రెండు రాష్ట్రాల సాంస్కృతిక ఆచార వ్యవహారాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక పోటీలలో అఖిల్ మరొక విద్యార్థితో కలిసి నాటు నాటు అనే పాటకు అభినయించి మొదటి బహుమతి పొందాడు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ ఈసుబ్ భాషా షేక్ పాల్గొన్నారు.

ఈ-కేవైసీ చేయించుకోవాలి

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేటలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ)లో సభ్యులందరూ ఈ-కేవైసీ చేయించుకోవాలని సంఘ సీఈవో బొడ్డేడ రాంబాబు తెలిపారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. సొసైటీ సభ్యులు ఈ-కేవైసీ కోసం ఆధార్ కార్డు, పాన్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలను సంఘ సీఈవోకు అందించాలన్నారు. చేయించుకోని సభ్యుల మెంబర్‌షిప్ అనామత్తుఖాతాకు బదిలీ కాబడడంతో పాటు ఓటు హక్కుకు అనర్హులవుతారన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఆంధ్రా యూనివర్సిటీ క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో 1975 – 80 బ్యాచ్ కెమికల్ ఇంజినీరింగ్ చదువుకున్న విద్యార్థుల అపూర్వ కలయికకు రాజమహేంద్రవరం వేదికగా మారింది. రాజమహేంద్రి విద్యాసంస్థల చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకుడు, పూర్వ విద్యార్థి టీకే విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో 40 మంది పూర్వ విద్యార్థులు సతీసమేతంగా స్థానిక ఇన్నీసుపేటలోని అరుణ ప్యాలెస్‌లో శనివారం సందడి చేశారు. చదువుకున్నప్పటి జ్ఞాపకాలను తలచుకుని సందడిగా గడిపారు. ముందుగా పూర్వ విద్యార్థులు ఒకరినొకరు పరిచయం చేసుకున్నారు. టీకే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ నాలుగు రోజుల పాటు సాగే ఈ పూర్వపు విద్యార్థుల ఆత్మీయ కలయికలో భాగంగా వాడపల్లి వెంకటేశ్వర స్వామి దేవాలయం, బాపనమ్మ గుడి, ర్యాలీ, అయినవిల్లి దేవాలయాలను సందర్శిస్తారమన్నారు. కోనసీమ, మారేడుమిల్లి తదితర ప్రాంతాలలో పర్యటనలు సాగుతాయని తెలిపారు. ప్రముఖ ఇంజినీర్ ఎస్.జోగారావు మాట్లాడుతూ కుటుంబ సభ్యులతో స్నేహితులను కలవడం ఆనందంగా ఉందన్నారు. పూర్వ విద్యార్థి రామచంద్రరావు మాట్లాడారు. అలాగే డాక్టరేట్ తీసుకున్న టీకే విశ్వేశ్వరరెడ్డి, ఉమామహేశ్వరి దంపతులను శాలువా, పుష్పగుచ్ఛాలు, మెమెంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో పీవీ సతీష్ కుమార్, తాతారావు, డి.జగదీష్, జి.సంజీవరెడ్డి, బి.రామ్మోహన్, శారద, బి.చంద్రశేఖర్, ఎస్.జోగేంద్ర పాల్గొన్నారు.



టీకే విశ్వేశ్వరరెడ్డి దంపతులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు